క్లుప్తంగా

ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపుపై జేసీకి ఫిర్యాదు



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: రాజకీయ నాయకుల ఒత్తిడితో తమను ఉద్యోగాల నుంచి తొలగించారని.. ఈ ఉదంతంపై తగు విచారణ చేపట్టాలని ఇటీవల సస్పెన్షన్‌కు గురైన మండలంలోని 21 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికామన్న అక్కసుతో వ్యవసాయశాఖామంత్రి కె.అచ్చెన్నాయుడు డ్వామా అధికారులపై ఒత్తిడి చేయడంతో తమను విధుల నుంచి అకారణంగా తొలగించి.. కొత్తవారిని నియమించారని వినతిపత్రంలో పేర్కొన్నారు. తమను ఉద్యోగాల నుంచి తొలగించడంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. తగు దర్యాప్తు జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. అధికారులను కలిసిన వారిలో తర్ర రమణ, దుబ్బ సింహాచలం, బి.పాపారావు, ఎన్.షణ్ముఖరావు, బి.సింహాద్రి ఉన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



కంచిలి సచివాలయం వద్ద దరఖాస్తుదారులు

కంచిలి: అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సాలిన నారాయణస్వామి కోరారు. ఈ మేరకు కంచిలి, కుంబరినౌగాం సచివాలయాల్లో ఆయా పంచాయతీల పరిధిలో పేదలు కార్యదర్శులకు సోమవారం దరఖాస్తులు అందజేశారు. మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పుక్కల్ల అరేలమ్మ, ఏఐవైఎఫ్ శివాజీ ప్రధాని, కొన్న శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డ్రైవర్‌కు గాయాలు



ప్రమాద దృశ్యం

సోంపేట: మండలంలోని పాలవలస సమీపంలో జాతీయ రహదారి బ్రిడ్జిపై సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బారువ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న లారీని డ్రైవర్ సడన్‌గా ఆపడంతో వెనుక నుంచి వచ్చిన లగేజ్ వ్యాన్ దాన్ని ఢీకొంది. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రజా ఫిర్యాదుల విభాగానికి 36 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి 36 అర్జీలు వచ్చాయి. వీటిలో ఎక్కువగా అపార్ కోసం ఆధార్‌కార్డులో పుట్టిన తేదీ మార్పు కోసం వచ్చిన వినతులే ఎక్కువగా ఉన్నాయి. మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు వినతులు స్వీకరించారు.

దేవాలయాల సంరక్షణకు సమాయత్తం కావాలి



మాట్లాడుతున్న కోటేశ్వరశర్మ

కవిటి: హిందూ దేవాలయాల సంరక్షణ ఉద్యమానికి ప్రతిఒక్కరూ సమాయత్తం కావాలని విశ్వహిందూ పరిషత్ అఖిలభారత్ సంయుక్త ప్రధాన కార్యదర్శి కోటేశ్వర శర్మ పిలుపునిచ్చారు. కవిటిలో సోమవారం నిర్వహించిన హైందవ శంఖారావం సన్నాహక సభలో ఆయన మాట్లాడారు. దేశంలో హిందువులు, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను మనమంతా సంఘటితంగా తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇందు కోసం వచ్చే ఏడాది జనవరి ఐదో తేదీన విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం సభకు హిందూ బంధువులంతా తరలి రావాలని కోరారు. వీహెచ్‌పీ ప్రతినిధులు ఆర్‌వీకేఎస్ రాంప్రసాద్, ఆనంద్, దాస్ పాల్గొన్నారు.

చి‘వరి’తడి కోసం ఆరాటం!

- ఎండిపోతున్న వరిపంటను కాపాడుకోవడానికి రైతుల అవస్థలు
- ట్యాంకర్లతో నీటిని తెచ్చి వరిచేనును తడుపుతున్న వైనం

కాశీబుగ్గ:

ఆ ప్రాంతానికి నదుల సౌకర్యం లేదు. సాగరాలు, చెరువుల్లో చుక్కనీరు లేదు. సుమారు 40 రోజులుగా వర్షాలు కూడా లేకపోవడంతో వరిచేను ఎండిపోయే పరిస్థితి నెలకుంది. దీంతో పంటను కాపాడుకోవడానికి గిరిజన ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వరి పంటకు ఆఖరి తడి అత్యవసరం కావడంతో ట్యాంకర్లతో నీటిని తెచ్చి తడుపుతున్నారు. మందస మండలం పరిధిలోని 41 పంచాయతీలు ఉండగా గిరిజన పంచాయతీలు 23 ఉన్నాయి. అందులో సుమారు 80కి పైగా గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో పంటల సాగు వర్షాధారంపైనే ఆధార పడి ఉంది. ఇందులో కొండ ప్రాంతాల్లో ఉన్న ఎనిమిది వందల ఎకరాల్లో గిరిజన రైతులు సాగు చేసిన వరిచేను ప్రస్తుతం ఎండిపోయే పరిస్థితికి వచ్చింది. కొద్ది రోజులుగా వర్షం పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొండ ప్రాంతంలో ఉన్నటువంటి ఈ పంట పొలాలకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్లతో సుదూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చి పంటను తడుపుతూ కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఒక్కో ట్యాంకర్ నీటి కోసం 15 వందల రూపాయలను ఖర్చు చేస్తున్నామని గిరి రైతులు చెబుతున్నారు. ఎన్ని ట్యాంకర్లతో నీటిని తీసుకొచ్చి తడుపున్నప్పటికీ పంట చేతికి వస్తుందో..లేదోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మందస మేజర్ పంచాయతీ భవనం వద్ద ఉన్న సాగరం నుంచి నీటిని ట్యాంకర్ల ద్వారా తీసుకువచ్చి పంటను తడుపుతున్నారు.



ట్రాక్టర్‌పై ట్యాంకర్‌ని తెచ్చి పొలానికి నీటిని పెడుతున్న దృశ్యం



ట్యాంకర్‌తో వరిపంటకు నీరు పెడుతున్న రైతులు

ట్యాంకర్ నీరు రూ.1500 కొంటున్నాను



హంసరాలి కొండ ప్రాంతంలో ఉన్నటువంటి రైతులమంతా కలిసి కట్టుగా ట్యాంకర్ నీటిని కొనుక్కొని వరిపంటకు ఆఖరి తడి అందిస్తున్నాం. ఈ ఏడాది పొట్టదశ వరకూ వర్షాలు కురువడంతో పంట చేతికి వస్తుందని సంతోషపడ్డాం. ఇప్పుడు చివరి తడి అవసరం ఉంది. వర్షాలు ముఖం చాటేశాయి. దీంతో ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేసి.. పైపుల ద్వారా పంటను తడుపుతున్నాం.

– సవర సోమేశ్వరరావు, గిరిజన రైతు, హంసరాలి

సాగునీటి సౌకర్యం కల్పించాలి



మందస మండల పరిధిలో ఉన్నటువంటి గిరిజన గ్రామాలకు సాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు స్పందించి సాగునీటి వనరుల అభివృద్ధిపై దృష్టిసారించాలి. కేవలం వర్షాధారంపై పంటలు సాగు చేస్తుండడంతో నష్టపోతున్నాం.

–సవర బాబూరావు, గిరిజన రైతు, బసవసాయి

విద్యారంగ పరిరక్షణకు సమరశీల పోరాటం

- ఘనంగా ఏఐఎస్‌ఎఫ్ 20వ జిల్లా మహాసభలు

కాశీబుగ్గ: విద్యారంగ పరిరక్షణకు సమరశీల పోరాటాలు అవసరమని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ 20వ జిల్లా మహాసభలు పలాసలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం అన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని అంబేడ్కర్ యూనివర్సిటీ అభివృద్ధి కోసం రూ.100 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ రవి మాట్లాడుతూ.. పాఠశాల్లోనే పిడికిలి బిగించి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్‌ఎఫ్ అన్నారు. 89 సంవత్సరాలుగా పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించాలన్నారు. తొలుత వందలాది విద్యార్థులతో కాశీబుగ్గ బస్టాండ్ నుంచి కీర్తన ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు రాము, సూర్య, విజయ, గుణశేఖర్, చిరు, హరిప్రసాద్, మహేష్, సాయి, శ్యాము ఉన్నారు.



ర్యాలీ చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ ప్రతినిధులు, విద్యార్థులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోటబొమ్మాళి: విద్యుత్ లైన్ మరమ్మతులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నారు. ఈ విషయాన్ని కోటబొమ్మాళి విద్యుత్‌శాఖ ఏఈ బి.వి.సురేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కురుడు, చౌదరికొత్తూరు, భావాజీపేట, రామయ్యపేట, మెండపేట, బలరాంపురం గ్రామాలకు సరఫరాను నిలిపి వేస్తామని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అండగా ఉంటా..అధైర్య పడొద్దు

- 41ఏ నోటీసు బాధిత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు తిలక్ భరోసా

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో కూటమి నాయకులు, అధికారుల చేతిలో కక్ష సాధింపు చర్యలు, వేధింపులకు గురవుతున్న ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని, ఎటువంటి అధైర్యపడొద్దని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ భరోసానిచ్చారు. రెండు రోజుల క్రితం టెక్కలి పోలీసులతో 41ఏ నోటీసులు అందుకున్న కార్యకర్తలను సోమవారం కలిసి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ వైఎస్సార్‌సీపీ కార్యకర్తను కాపాడుకోవడం తన బాధ్యత అన్నారు. ఈ విషయంలో ఏ ఒక్కరూ అధైర్యపడొద్దని ధైర్యమిచ్చారు. దాడులు, పోలీసులతో కక్ష సాధింపు చర్యలకు గురవుతున్న వారికి న్యాయపరంగా అండగా ఉండేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై ఇప్పటికే జిల్లా నాయకులు, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు వెల్లడించారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై బాధిత కార్యకర్తలతో చర్చించారు. నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, కార్యకర్తలు బి.తులసీరావు, ఎ.రాహుల్, నర్సింగ్‌నాథ్ సాబతో, పి.రమణబాబు, కె.జీవన్, బి.ఉదయ్, బి.రాజేష్, బి.భుజంగరావు, డి.మదీన్, సిహెచ్.బాలకృష్ణ, పి.మోహన్‌రావు, పాపారావు ఉన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న పేరాడ తిలక్

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

టెక్కలి: రాజ్యాంగ సమీక్షల పేరుతో అంబేడ్కర్ భావాలకు తూట్లు పొడుస్తున్నారని రాజ్యాంగ పరిరక్షణ వేదిక ప్రతినిధులు అన్నారు. రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని వేదిక ప్రతినిధులు కోత ధర్మారావు, బెలమర ప్రభాకర్రావు కోరారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈ నెల 26న జిల్లా కేంద్రంలో జరగనున్న ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద కరపత్రాన్ని ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని మతోన్మాద బీజేపీని ప్రజలందరూ వ్యతిరేఖించాలన్నారు. కార్యక్రమంలో ఎ.షణ్ముఖరావు, రాము, వెంకట్రావు, కేశవరావు, తులసీ, ఇందిరమ్మ, వెంకటమ్మ, సిమ్మమ్మ, జడ్డెమ్మ, సాయమ్మ, త్రివేణి ఉన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రక్షణ వేదిక ప్రతినిధులు

శివనామస్మరణ..



టెక్కలి: రావివలస ఎండల మల్లికార్జునస్వామికి క్షీరాభిషేకాలు చేస్తున్న భక్తులు

కార్తీక మూడో సోమవారం సందర్భంగా శివనామస్మరణ మారుమోగింది. నదులు, చెరువులు, సముద్ర తీరంలో స్నానాలు ఆచరించిన భక్తులు అనంతరం శైవక్షేత్రాలకు వెళ్లి పూజలు చేశారు. రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు చేసి స్వామికి నివేదించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దేవదాయశాఖ అధికారులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



సంతబొమ్మాళి ఆలయంలో బారులు తీరిన భక్తులు



కవిటి: రామలింగేశ్వరాలయంలో దర్శనానికి వెళ్తున్న భక్తులు



కోటబొమ్మాళి: కొత్తపేట శివకేశవ ఆలయంలో భక్తుల రద్దీ

కుమార్తె అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

నందిగాం: తన కుమార్తె ఈ నెల 15వ తేదీ నుంచి కనిపించడం లేదని పెద్దతామరాపల్లి గ్రామానికి చెందిన సవలాపురం నర్సయ్య ఫిర్యాదు చేసినట్టు నందిగాం పోలీసులు సోమవారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై షేక్ మహమ్మద్‌ఆలీ తెలిపారు.

విద్యార్థులు ఆధార్‌ను అప్డేట్ చేసుకోవాలి

కంచిలి: విద్యార్థులు తప్పనిసరిగా ఆధార్ కార్డులను అప్డేట్ చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి–1 ఎస్.శివరాంప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో సోమవారం నుంచి ప్రారంభమైన ఆధార్ కేంద్రంలో అప్డేట్ ప్రక్రియను పరిశీలించారు. సోమవారం 52 మంది విద్యార్థులు ఆధార్‌ను అప్డేట్ చేసుకొన్నారు. అప్డేట్ ప్రక్రియను సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు పుష్ప, నవీన, పుణ్యవతి చేపట్టారు.

ఆలయ వార్షికోత్సవం

కంచిలి: బెల్లుపడ గ్రామంలోని రుక్మిణి రాధాకృష్ణ ఆలయం మొదటి వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు లడ్డు కేశవపాత్రో, కొణపల సురేష్, స్థానిక సర్పంచ్ అయిధం జయరాం, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

స్తంభించిన ట్రాఫిక్



ట్రాఫిక్‌లో ఇరుక్కున్న 108 వాహనం

టెక్కలి రూరల్: కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా రావివలస ఎండల మల్లికార్జున స్వామివారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో వాహనాల రాకపోకలతో టెక్కలిలోని పలు రోడ్లు కిటకిటలాడాయి. స్థానిక గోపినాథపురం రైల్వేగేటు వద్ద సుమారు 30 నిమిషాలకుపైగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో అవస్థలు ఎదురయ్యాయి. ట్రాఫిక్‌లో 108 వాహనం సైతం కొద్దిసేపు నిలిచిపోయింది. అయితే వాహనదారులు 108 వాహనం వెళ్లేందుకు దారి ఇవ్వడంతో వెళ్లిపోయింది.

కళాకారులకు సన్మానం



కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

కంచిలి: పెద్దశ్రీరాంపురం గ్రామంలోని రామలింగేశ్వరాలయంలో ఉద్దానం సంగీ కళాకారులను ఏఎస్పీ లమ్మత మోహనరావు ఘనంగా సన్మానించారు. కార్తీక సోమవారం పూజలను గ్రామానికి చెందిన అడిషనల్ ఎస్పీ మోహనరావు ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. అనంతరం ఉద్దానం సంగీత కళాకారులను దుశ్శాలువలతో సత్కరించి అభినందించారు. సన్మానం పొందిన వారిలో హార్మోనిస్ట్ మార్పు నారాయణరావు, మృదంగం కళాకారుడు మాదిన మోహనరావు, గాయకుడు దూట్ల వెంకటేశం ఉన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మాదిన చిరంజీవు పాల్గొన్నారు.

సేవాభావం..



కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా టెక్కలి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక సేవాభావం వెల్లివిరిసింది. పట్టణంలో పలు దేవాలయాలతో పాటు రావివలస మల్లన్న దర్శనానికి వెళ్లే భక్తుల కోసం దారి పొడవునా ఉచిత ప్రసాదాలు, మజ్జిగ, మంచినీటి పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. టెక్కలి గోపినాథపురం వద్ద షిర్డీసాయి సేవా సభ్యులు ఉచిత ప్రసాదాలు అందించారు.

–టెక్కలి

ప్రారంభం..



కంచిలి మండలం బూరగాం గ్రామ ఎస్సీ వీధిలో 15వ ఆర్థిక సంఘం మండల పరిషత్ నిధులు రూ. 3.5 లక్షలతో ఏర్పాటు చేసిన బోరు, వాటర్ ట్యాంక్ సిస్టమ్‌ను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. నీటిని సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దుర్గాసి ధర్మారావు, స్థానిక నేతలు మడ్డు వెంకటరావు, మద్దిల భీమారావు, మాస్టీల మన్మథరావు, పలికల జయరాం, కొణపల సురేష్, లడ్డు కేశవపాత్రో ఉన్నారు.

–కంచిలి

అమ్మవారి దర్శనం



ప్రస్తుత సమకాలీన పరిస్థితుల్లో హిందూ సమాజాన్ని జాగృతం చేసి దేశ ఐక్యతవైపు అడుగులు వేయాలని విశ్వహిందూ పరిషత్ కేంద్రీయ సంయుక్త కార్యదర్శి కె.కోటేశ్వరశర్మ అన్నారు. ఇచ్ఛాపురం పట్టణంలోని స్వేచ్ఛావతి అమ్మవారిని సోమవారం దర్శించుకొని పూజలు చేశారు. ప్రతీ హిందువు సమాజ అభివృద్ధి, దేశఐక్యతలో భాగస్వామ్యం కావాలని సూచించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆయనకు అమ్మవారి ప్రతిమతో కూడిన జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

–ఇచ్ఛాపురం

యూటీఎఫ్ సభలకు ఆహ్వానం



హరిపురంలో ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించనున్న యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా సహాధ్యక్షులు కె.దాలయ్య కోరారు. ఈ మేరకు నందిగాం మండలంలోని పలు పాఠశాలలను సోమవారం సందర్శించి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను స్వర్ణోత్సవ మహాసభలకు ఆహ్వానించారు. పీడీఎఫ్ తరఫున ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కోరెడ్ల విజయగౌరీని గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.శంకరరావు, టెక్కలి మండల కార్యదర్శి టి.వైకుంఠరావు, నందిగాం మండల అధ్యక్షులు కుమారస్వామి ఉన్నారు.

–నందిగాం

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

కాశీబుగ్గ: వచ్చేనెల 14వ తేదీన నిర్వహించనున్న లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ యు.మాధురి అన్నారు. ఇప్పటి వరకూ పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ఇన్‌చార్జి మెజిస్ట్రేట్‌గా వ్యవహరించిన కోటబొమ్మాళి మెజిస్ట్రేట్ బి.ఎం.ఆర్.ప్రసన్నలత స్థానంలో మాధురి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇరువురు మేజిస్ట్రేట్‌లు పలాస బార్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమై లోక్‌అదాలత్‌ను విజయవంతం చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.విశ్వేశ్వరరావు, సెక్రటరీ పిండి వెంకట్రావు, జాయింట్ సెక్రటరీ జి.ఎం.ఎస్.అనిల్ రాజు, వైస్ ప్రెసిడెంట్ ఫయాజ్ అహ్మద్, సీనియర్ న్యాయవాదులు లక్ష్మీనారాయణ, తాండ్ర మురళీ మోహన్, కోత రజినికుమార్, గురుగుబల్లి ప్రభాకర్‌రావు, చిట్టిబాబు, తేజేశ్వరరావు, రవికుమార్, శ్యామ్, దేవరాజు, విగ్నేశ్వరరావు, సూపరింటెండెంట్ కృష్ణారావు, గోవిందరావు పాల్గొన్నారు.



సమావేశంలో మేజిస్ట్రేట్‌లు, బార్‌అసోసియేషన్ సభ్యులు

సంక్షిప్తంగా...

భక్తిశ్రద్ధలతో శివపార్వతుల తిరువీధి

టెక్కలి: కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా కె.కొత్తూరులో శివపార్వతుల తిరువీధి ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాశీ విశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

ఘనంగా సత్యసాయి బాబా జయంతి వేడుకలు



కంచిలి: దొలాయిసాయి గిరిజన గ్రామంలో సత్యసాయి పల్లకీసేవలో భక్తులు

కంచిలి: భగవాన్ శ్రీసత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలను దొలాయిసాయి, కర్రిసాయి, బొందువసాయి గిరిజన గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి పల్లకీ ఉత్సవం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి దుప్పటి, స్వామివారి ఫొటో, విభూతి, ప్రసాదం అందజేశారు. సోంపేట సత్యసాయి దివ్య సమాజం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈపరి రవి, తిరుమల, శ్రీను, రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: సత్యసాయిబాబా జన్మదినోత్సవ వేడుకలను పట్టణంలోని గొల్లవీధిలో గల సత్యసాయి నిలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక సత్యవ్రతాలు చేశారు. సత్యసాయి సేవాసమితి ప్రతినిధులు ఆర్.గోపాలరావు, కె.జనార్దనరావు, సుబ్బారావు, సింహాచలంపాడీ, భాస్కర్‌రావు, విజయ్‌సాహు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

కాశీబుగ్గ: మందస మండలం గొల్లలపాలెం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని నర్తు కరిష్మ ఆటో ప్రమాదంలో గాయపడింది. శ్రీపవనపుత్రా సేవా సంస్థ సభ్యులు ఆమెకు అండగా నిలిచారు. పది వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని కరిష్మకు సోమవారం అందజేశారు. సంస్థ సభ్యులు మజ్జి భాస్కరరావు, కొల్లి ఫాల్గుణరావు, రాపాక కేశవరావు, రెల్లి ఉమామహేశ్వరరావు, బద్రి వసంత్, గంగిట్ల దేవరాజు, కొర్నల ధనుంజయ ఉన్నారు.

బాలియాత్రకు అధ్యాయన బృందం

కాశీబుగ్గ: ఒడిషా రాష్ట్రం కటక్‌లో జరుగుతున్న బాలియాత్రను అధ్యాయనం చేయడానికి జిల్లాకు చెందిన కమిటీ సభ్యులు సోమవారం పయనమై వెళ్లారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు మాట్లాడుతూ.. ఇటీవల శ్రీముఖలింగంలో నిర్వహించిన పురాతన బాలియాత్ర విజయవంతమైందన్నారు. వచ్చే ఏడాదిలో శ్రీముఖలింగంలో జరగనున్న బాలియాత్ర మరింత గొప్పగా నిర్వహించాలని భావిస్తున్నామన్నారు. అందులో భాగంగా కటక్‌లో జరుగుతున్న యాత్రను అధ్యాయనం చేస్తున్నామన్నారు. కమిటీ సభ్యులు హెచ్.వి.దొర, బొడ్డేపల్లి శ్రీరామ్, నేతాజీ, చందుభరద్వాజ్ ఉన్నారు.

23న సత్యసాయి జన్మదినోత్సవం

కాశీబుగ్గ: సత్యసాయి బాబా 99వ జయంతి పరబ్రహ్మోత్సవాన్ని ఈనెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్లు పలాస సత్యసాయి సేవా సమితి కన్వీనర్ మల్లా రామేశ్వరం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సామూహిక దీపారాధన, నగర సంకీర్తనలు, సాంస్కృతి కార్యక్రమాలు, మహాఅన్న సమారాధన ఉంటాయన్నారు.

ప్రసాదానికి నోచుకోని మల్లన్న భక్తులు!

టెక్కలి: కలియుగ కైలాసం రావివలస ఎండల మల్లికార్జునస్వామి ఆలయంలో కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా మల్లన్న దర్శనానికి వచ్చిన భక్తులు ప్రసాదానికి నోచుకోలేదు. దీంతో దేవదాయ శాఖ అధికారుల తీరుపై భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఈ వారం దేవదేయ శాఖ ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదం కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఉదయం 10.30 గంటలకే కౌంటర్ ఖాళీ అవడంతో భక్తులకు నిరాశ మిగిలింది. కార్తీక మాసంలో మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఉచితంగా ప్రసాదాలు అందజేయాలని గతంలో ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలనకు విచ్చేసిన మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆయన ఆదేశాలు ఇక్కడ అమలు కాలేదు. ఎంతో దూరం నుంచి స్వామి దర్శనానికి వచ్చిన తమకు కనీసం ప్రసాదం లేకపోవడం బాధాకరమని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి మూడో సోమవారం భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ముందస్తు ప్రణాళిక లేకుండా అధికారులు వ్యవహరించిన తీరుపై భక్తులు మండిపడ్డారు.